# డిసెంబర్ 6 ప్రపంచ వాతావరణ దినోత్సవం World Climate Day




గాల్లో వేడి పెరిగిందే, ఎండే పేలినట్టుందే
గ్రీను హౌస్‌లోను గ్లోబ్ నంత పెట్టినట్టుందే
వానే వస్తూ పోతూందే, మొత్తం మారిపోతుందే
ఫుల్ మంటపెట్టి దించకుండా కాగినట్టుందే
ఒజోను మిథేను $Co_2$ను మనవల్లన
క్లోరోఫ్లోరో కార్బన్‌లెన్నో(CfC), $No_2$లే మితిమీరెనే
గాల్లో వేడి పెరిగిందే, ఎండే పేలినట్టుందే
గ్రీను హౌస్‌లోను గ్లోబ్ నంత పెట్టినట్టుందే
నార్త్‌పోల్ ఐసేకరిగి, ఐసే కరిగి నీరై పోయె, నీరు చేరి అలలై పొంగే సీలో... సీలో...
గ్రీను హౌస్ గాలే తాకి, ఒజోను మందం తగ్గి, పొరల హోలే అయ్యె పోల్ వద్ద స్కైలో
మనుషులకైన మొక్కలకైనా చిక్కులు ఎన్నో యువి రేస్‌తో (Ultra Voilet Rays)
పంటలలోనూ దిగుబడి తగ్గి, జాతులు ఎన్నో దూరం అయ్యే ఈ భూమికి..



గాల్లో వేడి పెరిగిందే, ఎండే పేలినట్టుందే
గ్రీను హౌస్‌లోను గ్లోబ్ నంత పెట్టినట్టుందే
లిమిట్ దాటి వాడే విద్యుత్, వేస్ట్‌గాను పోయే వాటర్, టాపు స్విచ్ఛ్ రెండూ కట్టు ఇంట్లో.. ఇంట్లో..
కారుమాని బైకే తొక్కు, అడుగువేసి పరుగేపెట్టు, హద్దు దాటి హాయే వద్దు ఏ ఏసి తో...
ప్లాస్టిక్ నో నో, తిరిగివాడు, సూర్యుడు తోడు నీ నీటికి
చెట్లను నాటు, అడవులు పెంచు, వెజ్‌కు మార్చు నీ డైట్‌ని -- సుగుణశ్రీ

**^****^****^****^*****^**

**వేడికి వేడికి - చలికి చలికి:**

చాలా కాలంగా వాతావరణకాలుష్యం, గత దశాబ్దంనుండి Global warming పెరిగిపోవడం, Ozone layer మందగించడం, ధ్రువప్రాంతాలలో మంచుపర్వతాలు కరిగిపోవడం, Acid rains కురవడం (ఆమ్లవర్షాలు), తుఫానులు, సునామీలతోపాటు సముద్రమట్టంపెరిగి భూమిని కబళించడం, వర్షాలు సకాలంలో కురవక అతివృష్టి-అనావృష్టికి దారితీయడం, ప్రకృతి ఉపద్రవాలవల్ల ఆస్తులు, పంటలు, ప్రాణాలు నష్టపోవడం, కరువుకాటకాలు పెరిగినందువల్ల భూగోళంమీద మనుగడ రోజురోజుకు కష్టతరం, బాధామయం కావడం చూస్తున్నాం, వింటున్నాం, అనుభవిస్తున్నాం. ముందు ముందు ఉష్ణదేశాలలో మరింత వేడి, శీతలదేశాలలో మరింత చలి పెరుగుతుంది.

**పోలెండ్ - కోపెన్ హాగన్ సమావేశాల ప్రాముఖ్యం:**

ఈ పరిస్థితులవల్ల మానవజాతికి - భూగోళానికి ఎదురవుతున్న ప్రమాదాలు పరిష్కరమార్గాలను సూచిస్తూ, ప్రచారంచేస్తూ ఆ కార్యక్రమాలకు అన్ని దేశాల మద్దతు కూడగడుతూ ఐక్యరాజ్యసమితి (UNO) గత కొన్నేళ్ళుగా ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని (World Climate Day) డిసెంబర్ 6న జరుపుతున్నది. ఈ సంవత్సరం పోలెండ్ దేశంలో అన్ని దేశాల ప్రతినిధులు సమావేశమై, వచ్చే సంవ్సతరం కోపెన్ హ్యాగన్‌లో ప్రపంచ దేశాధినేతలందరూ ఆమోదించనున్న ఒక ముసాయిదా తీర్మానాన్ని రూపొందించనున్నారు. భారతప్రభుత్వం తమ తీసుకొనున్న చర్యలగూర్చి ఒక నివేదిక ప్రకటించింది.

ఈ యేడు అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికాలో ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో పడడంతో, చాలా దేశాలు ఈ విషయంపై, ఈ సమావేశంపై తగినంత ఆసక్తి చూపించవని సందేహం. అందుకు గట్టిగా మనం గొంతు వినిపించాలి.

The immediate issue is not so much that there will be no oil or energy resource, as it is not having enough to keep the economies running. See, the world economy does not need to deplete its entire reserve to collapse. Let me explain this with an example. Humanbody is 70% water. The body of a 50kg girl has 35kg of (or litres) of water. Because water is so crucial to everything the human body does, she does not need to lose all 35kg of water weight before collapsing due to dehydration. Even a loss of as little as 4-5kg of water is enough.

ప్రపంచ వాతావరణ దినాన్ని మనం మన విద్యాసంస్థలలో వక్తృత్వపోటీ, క్విజ్‌కాంపిటీషన్, పరిసరాలశుభ్రత, మానవహారం ఇలా ఎన్నో విధాలుగా జరుపుకోవచ్చు. అందుకోసం ఈ వాతావరణం మార్పువల్ల నష్టాలు, నష్టాలు అరికట్టడంవల్ల వచ్చే ప్రయోజనాలగూర్చి విద్యార్థులకు యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులకు తెలియచెప్పడానికి మనం కొంత వివరంగా, స్పష్టంగా చర్చించుకోవడం అవసరం.



భూమి మరింతగా వేడెక్కడానికి అంటే ఉష్ణోగ్రత పెరగడానికి మనం ఉపయోగించే ఇంధనాలు, భూగర్భవనరులు - బొగ్గు, పెట్రోలియం వాడకం పెరగడం ఒక కారణం. బొగ్గు, పెట్రోలియం వగైరా ఉత్పత్తులనుండి కాలుష్యాన్ని ($Co_2$ కార్బన్‌డయాక్సైడ్) తగ్గించడంలో మనం పెద్దగా కృషి చేయడంలేదు. ఈ వనరులను ఎక్కువగా అభివృద్ధి చెందిన దేశాలే వాడుతున్నారు. ఉత్పత్తులుకూడా అక్కడినుండే దిగుమతి అవుతున్నాయి. కాబట్టి వాతావరణాన్ని బాగుచేసే బాధ్యత ప్రధానంగా వారిది. వారిదేశాలలో విడుదలైన కాలుష్యం అక్కడే ఉండిపోదు. అది వాతావరణంలో కలిసి ప్రపంచమంతా విషపూరితం చేస్తుంది.

ఈ దేశాలు తమదేశాలలో ప్రమాదకరమైన వ్యర్థపదార్థాలను వివిధ దేశాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా, దొంగతనంగా రవాణాచేస్తున్నాయి, అంటగడుతున్నాయికూడా. కాని చాలా దేశాలు తాత్కాలికంగా ఏదో ఉపశమన చర్యలు తప్ప, శాశ్వత చర్యలు చేపట్టడానికి కావలసినంత పెట్టుబడిని తమ నిధులనుండి మళ్ళించడానికి సిద్ధంగా లేవు. వారి మెడలువంచడానికి అంతర్జాతీయస్థాయిలో వత్తిడి తేవాలి. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఈ సభలు, సమావేశాలు, చైతన్యయాత్రలు, మేళాలు జరుపవలసిందిగా 'సమితి' పిలుపునిచ్చింది.

అయితే సంపన్నదేశాలలో మార్పువచ్చేదాకా మనం చేతులు ముడుచుకుని, వాళ్ళను తిట్టుకుంటూ కూచోలేం. ప్రత్యామ్నాయాలు అన్వేషించాలి. తగిన విధాన నిర్ణయాలు తీసుకొనే విధంగా వివిధ స్థాయిలలో అటు ప్రభుత్వం, ప్రైవేటురంగం, జనసామాన్యం ఇంధన వినియోగపద్ధతులలో తగిన మార్పు పాటించేలా అన్నివైపులనుండి అటు వత్తిడిని, ఇటు ప్రోత్సాహాన్ని పెంచాలి.

స్థూలంగా ఐదురకాల ప్రయత్నాలు ఈ దిశగా జరుగుతున్నాయి.

1. కార్బన్‌డయాక్సైడ్ విడుదల తగ్గించడం - సమతుల్యత సాధించడం. 
2. ప్రమాదాలను కరువుకాటకాలను తట్టుకునే సంసిద్ధత పెంచడం, నష్టం తగ్గించడం. 
3. ప్రత్యామ్నాయ వనరుల వాడకం పెంచడం.    
4.  అడవులు, సరస్సులు కాపాడడం, చెట్లు పెంచడం.
5. జనసామాన్యం అలవాట్లలో, జీవనవిధానంలో మార్పు.

ఈ ఐదు రంగాలలో జరుగుతున్న కృషి -

వాతావరణ కాలుష్య నియంత్రణ పాటించడంలో ఒక పద్ధతి Clean Development Mechanism (CDM) ఒకటి.

**నవభారత్ వెంచర్‌వారు, సామర్లకోట ఫ్యాక్టరీలో ఏర్పరచిన ఈ ఏర్పాటు ప్రభుత్వం గుర్తించింది. విజయవాడలో ఇటుకబట్టి యజమానులందరు కలసి ఈ ఏర్పాటు చేసుకొని ప్రపంచబాంకునుండి ప్రోత్సాహకాలు పొందారు.**

NAVA BHARAT

విడుదల - వినియోగంలో సమతూకం:



మన రాష్ట్రంలో సింగరేణి కాలరీస్ రాక్షసి బొగ్గు వెలికి తీస్తుంది. అలాగే మన జిల్లాలో గోదావరి తీరంలో సహజవాయువు వెలికితీసి త్వరలో అన్ని రంగాలకు సరఫరా చేయనున్నారు. ఈ రెండు వనరుల వెలికితీతలో బొగ్గుపులుసు వాయువు విడుదల, అరికట్టడం. సమతూకంలో (Carbon neutral) ఉండాలి.




***సకాలంలో బస్సు సౌకర్యం; ఇంధనం ఆదా :*** **ప్రభుత్వరంగం ప్రయాణీకుల రవాణాను నిర్వహిస్తున్నందుకు (RTC) మన రాష్ట్రప్రభుత్వం పేరు పొందింది. ఇంధనం పొదుపుకు అవార్డులుకూడా పొందింది. సకాలంలో బస్సులు నడిపితే ప్రజలకు సొంత, ఇతర వాహనాల అవసరం తగ్గుతుంది. ఇంధనం మరింత ఆదా అవుతుంది. సుప్రీంకోర్టు ఢిల్లీలో వాహనాల కాలుష్యం తగ్గించడంలో గట్టి పట్టుదల చూపించింది. తూర్పుగోదావరిజిల్లా గిరిజనప్రాంతంలో అడవులు నరికివేత, గనులతవ్వకం కోసం ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వులనన్నింటినీ 'శక్తి' స్వచ్ఛంద సంస్థ కోర్టుద్వారా రద్దు చేయించింది. అయినా వంటచెరకు, కలప దొంగ రవాణా జరుగుతునే ఉన్నది. కొంతమందికి అది జీవనాధారం అయింది.**

ప్రత్యామ్నాయ ఇంధన వనరులు : మనది ఉష్ణదేశం. కాబట్టి ఎక్కువ సౌరశక్తి వినియోగం మనకు లాభదాయకం. ఈ సౌరశక్తి, వాయుశక్తి ఫ్యాక్టరీలలోనే కాక కుటీరపరిశ్రమలలో కూడా మనం ఉత్పత్తి చేయవచ్చు. ఎక్కడికక్కడే వాడుకోవచ్చు. ఆ పరికరాలు అందుబాటులోకి వచ్చేటట్లు ప్రభుత్వం ఈ రంగం ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలివ్వాలి. ఈ విధంగా ఉపాధి పెరుగుతుంది.

***ప్రత్నామ్నాయ వనరులు - ఉపాధి అవకాశాలు :*** **హైదరాబాదులోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలో మహిళలను సౌరశక్తి పరికరాలనుకూర్చి సోలార్ పానెళ్ళు, లాంతర్లు తయారు చేస్తున్నారు. రాజస్తాన్‌లో తిలోనియాలో ఒక స్వచ్ఛందసంస్థ ఇటువంటి పరికరాల సర్వీసింగ్, నిర్వహణలో మహిళలకు, యువకులకు శిక్షణనిస్తుంది. గిరిజన సంక్షేమశాఖ పింజరికొండ వద్ద (అడ్డతీగల మండలం) గిరిజన మహిళలతో జలవిద్యుత్ ఉత్పత్తికి పని ప్రారంభించింది.**



**ప్రత్నామ్నాయ ఇంధనం కోసం, కర్రపెండలంనుండి ఎథనాల్ ఉత్పత్తి పెంచడానికి నవభారత్ వెంచర్స్ కర్రపెండలం సాగుమీద దృష్టి పెట్టింది. రైతుల సాధక బాధకాలు అర్థం చేసుకోవడానికి, పాఠశాలల, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటుంది.**

ప్రకృతి ఉపద్రవాలు - నివారణ ప్రణాళికలు : ఇప్పుడున్న పరిస్థితి అందరూ కృషిచేస్తే, 2050 నాటికిగాని చక్కపడదు. అంతదాకా ప్రకృతి ఉపద్రవాలు, బొగ్గుపులుసు వాయువు, మిథేన్ వగైరా విషవాయువుల వల్ల ప్రమాదాలు తప్పవు. ఆ ప్రమాదాలవల్ల జరిగే నష్టం వీలైనంత తగ్గించుకొనే ప్రయత్నం చేయాలి. అటు ప్రభుత్వంలో, ప్రైవేట్‌రంగంలో ఈ ప్రమాదాలు తగ్గించుకునే ఏర్పాట్లు ఉంటాయి కాని ఎవరూ దాన్ని పట్టించుకోరు. ఉదాహరణకు ప్రతి జిల్లాప్రభుత్వం యంత్రాంగం తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు ఏ గ్రామం ప్రజలను ఎక్కడకు తరలించాలి. అటువంటి పునరావాసకేంద్రాలలో భోజన, వైద్య సదుపాయాలకోసం వస్తు సామగ్రిని ఎంత ముందుగా ఎక్కడికి చేరవేయాలి, ఏయే అధికారులు దీనికి బాధ్యత వహించాలి. ఈ ప్రణాళిక తయారు చేసుకొని సన్నద్ధంగా ఉండాలి.

***చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం:*** **జిల్లా ప్రణాళిక సంఘం** (District Planing Committee) **మీటింగ్‌లో గోదావరిడెల్టా కాలువకింద నీళ్ళెప్పుడు వదులుతారో నాయకులు చర్చిస్తారుకాని వరదలు, తుఫానులు వచ్చినప్పుడు ఏయే ఏర్పాట్లు చేశారు, ఈ ఏర్పాట్లు ప్రజలందరికీ తెలియచేసే ఏర్పాట్లు ఏమిటి, ఆ ఏర్పాట్లు సరిగ్గా అమలు జరుగుతున్నాయా. ఇవి ఈ సమావేశాలలో చర్చించరు. నష్టం జరిగాక పరిహారం కోసం మాత్రం ప్రజలు, నాయకులు కొట్లాడుకుంటారు. కాబట్టి ముందు జాగ్రత్త చర్యలు చర్చించే విధంగా నాయకులమీద వత్తిడిపెంచాలి. ప్రచారసాధనాలు ఈ చర్చలకు ప్రాధాన్యమివ్వాలి. పాఠశాలల్లో ప్రజలకోసం వాతావరణం కొలిచే కేంద్రాలు ఏర్పాటు చేయాలి (ఉష్ణోగ్రత, తేమ, గాలివేగం) నగరాలలో వ్యర్థపదార్థాలను ఇంధనంగా మారే ఏర్పాటు చేసుకోవాలి.**

**అడవులు, తోటలు, సరస్సులు కాలుష్యాన్ని భరిస్తాయి :** బొగ్గుపులుసువాయువుతో చెట్లు పిండిపదార్థాలను తయారు చేసుకుంటాయి అని మనం చిన్నప్పటినుండి చదువుతుంటాం. కాని అడవులు, చెట్లు క్షీణిచడంవల్ల బొగ్గుపులుసు వాయువు పెరిగిపోతుంది. అలాగే మడ అడవులు (కోరింగ), సహజసరస్సులు, మంచినీటిని సమతుల్యంగా వదులుతూ సముద్రతీరాలు చవుడుబారకుండా కాపాడుతూ, మంచినీరుకూడా అందిస్తాయి. ఒరిస్సాలో చిలక, మన రాష్ట్రంలో కొల్లేరు, పులికాట్ అటువంటి సరస్సులు. నదులలో వచ్చే ఒండ్రుతో సముద్రతీరాన డెల్టా ఏర్పడింది. సముద్రంనుండి రక్షణకోసం తోటలు పెంచాలి. ఈ



చర్యలు చేపట్టకపోగా ఉన్నతోటలు నరికివేసినందున సరస్సులు, అడవులు పాడుచేస్తునందున్న సముద్రం క్రమంగా కబళించడాన్ని గోదావరి కోస్తా తీరమంతా మనం చూడవచ్చు (ఉప్పాడ, కాట్రేనికోన, చినమైనవాని లంక). పెద్దవి కాకపోయినా చిన్న చిన్న సరస్సులు మన చుట్టూ ఎన్నో ఉన్నాయి. రాజానగరం దగ్గర పుణ్యక్షేత్రం, దేవీపట్నం మండలంలో నేలకోట ఇటువంటి చిన్న చిన్న సరస్సులకు ఎన్నో పక్షులు ఎంతో దూరంనుండి వచ్చి సంతానం కని, అవి పెరిగాక వెళ్ళిపోతాయి. ఈ పక్షులు కాన్పుకు పుట్టింటికి వచ్చే ఆడపడుచులను గుర్తుచేస్తూంటాయి.



**జీవవైవిధ్య రిజర్వ్‌లు - పర్యాటక కేంద్రాలు :** ఈ చిన్నసరస్సులు జీవవైవిధ్యరిజర్వ్‌లుగా పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. ఈ సరస్సులు ఎంత చిన్నవైనా వాతావరణంలో ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. మంచినీటి నిలువలను పెంచుతాయి. కాబట్టి అవి ఆక్రమణలపాలు కాకుండా చూసుకోవాలి.

**జనసామాన్యంలో చైతన్యం వారిఅలవాట్లలోనే కాదు, ప్రభుత్వ విధానాలలోకూడా మార్పు తెస్తుంది.**

1. తక్కువ వేడిని విడుదలచేసే బల్బుల వాడకం చేపట్టాలి. 
2. విద్యుత్, పెట్రోలు వీటి ఉత్పత్తుల వాడకం వీలైనంత తగ్గించుకోవాలి.
3. అవకాశమున్నంత సౌరశక్తి, బయోగాస్, వాయుశక్తి, జలవిద్యుత్ ఉపయోగించుకోవాలి.
4. మనంవాడిన పదార్థాలు విడివిడిగా తీసి, వీలైనవాటిని తిరిగివాడుకోవాలి. (*Recycle*)



5. **కరువులు కాటకాలు** వచ్చినప్పుడు **ప్రత్నామ్నాయ పంటలు** ఎన్నో మన రైతులకు తరతరాలుగా తెలుసు. నీటిలో తేమకు తగ్గ పంటలు పండించడం తెలుసు, ఋతువులలో మార్పును ముందే గుర్తించగలరు. విత్తనాలు, ఎరువులు స్వయంగా తయారు చేసుకోవడం తెలుసు. వీటిని కొనసాగించకపోగా అసలు ఈ విషయాలు మరచిపోతున్నాం. ఏదన్నా అవసరం వచ్చినప్పుడు ఈ సలహాలు గుర్తుచేసేవాళ్ళుకూడా మన ఊళ్ళలో ఇప్పుడు కనిపించడంలేదు. అన్ని రకాల కల్తీలకు రైతు దెబ్బతింటున్న తరుణంలో, ఈ సంప్రదాయ విజ్ఞానం అంతరించిపోవడం దురదృష్టకరం.

**పాతకొత్తలు మేళవింపు:** ఈనాటి శ్రీవరి ఒకనాటి మన బుడమపంట. సేంద్రియ వ్యవసాయం మన రైతులకు తెలిసినదే. అటువంటి ఆహారభద్రత, ఇంధనోత్పత్తి రెండిటికీ ఉపయోగపడే పంటలు పెంచడం జనాభా ఎక్కువగల మనవంటి దేశాలకు మంచిది. మనం అవసరానికి మించి రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడుతున్నాం. ఇది మనకు పొలాలకు వాతావరణానికి మంచిది కాదు. మన మత్స్యకారులు ప్రకృతి ఉపద్రవాలైన తుఫాన్‌లను గాలులనుబట్టి, తరంగాల నురగలనుబట్టి, చేపలను వేటాడే పక్షుల కదలికలనుబట్టి చాలా ముందే గుర్తించేవారు. జ్ఞానంలో పాతకొత్తలు మేళవించి ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలి.



**రానున్న రోజుల్లో నీరు, ఇంధనం మానవాళి మనుగడలో కీలకపాత్ర వహిస్తున్నాయి.** నీరు కరువైతే పారిశుధ్యం లోపిస్తుంది. మంచినీరు కలుషితమైతే వ్యాధులు ప్రబలుతాయి. నీళ్ళ కోసం కి.మీల కొద్ది వెళ్ళాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత పెరిగితే వృద్ధులు, పిల్లలు అల్లాడుతారు. డయేరియా, ఉడుకుజ్వరాలు విజృంభిస్తాయి. పరిశ్రమలు మంచినీటి బదులు, బ్రౌన్‌వాటర్, బ్లూవాటర్‌లను వాడే ప్రయత్నాలు పెరగాలి.








పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటినుండి తాత్కాలిక ప్రయోజనం కోసం మనం పర్యావరణాన్ని ధ్వంసంచేస్తూ వాతావరణాన్ని పాడుచేస్తూ వచ్చాం. ఈ పద్ధతి మారాలి. నాయకులను అధికారులను తమ బాధ్యత నిర్వహించవలసిందిగా వత్తిడిచేస్తూ చేతులు దులుపుకోకుండా, మన జీవితంలోకూడా ఈ మార్పును పాటించాలి. పదిమంది ఈ విషయాలను చర్చించుకొంటూ మార్పును వేగిరపరచాలి.

*Presentation:* **SAKTI**, Rampachodavaram.